క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన కేవీ పద్మావతిని సీడీఎంఈకు రిపోర్ట్ చెయ్యాలని ఆదేశాలు అందడంతో ఆమె స్థానంలో శ్రీకాంత్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈయన కాకినాడ కార్పొరేషన్‌లో కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పురప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. పట్టణ పరిశుభ్రతతో పాటు పట్టణాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తొలుత మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి ఆధ్వర్యంలో ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

ఎయిడ్స్‌పై కళాజాతా


సంత మార్కెట్‌లో ప్రదర్శిస్తున్న కళాజాత

సామర్లకోట: రాష్ట్ర ఎయిడ్స్ నిర్మూలన సంస్థ, జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు పెద్దాపురం వైజ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సంత మార్కెట్ సెంటర్‌లో ఎయిడ్స్‌పై అవగాహనకు కళాజాత ప్రదర్శించారు. సుఖ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలనే విధంగా నాటికలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో కార్యక్రమంలో ఐసీటీసీ కన్వీనర్ బి. శ్రీనివాసు, వైజ్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు బి.మల్లేశ్వరి, ప్రాజెక్టు డైరెక్టరు ఆర్.జయ, మేనేజరు ఎల్.శైలజ, ఎంఅండ్‌ఎఫ్ఏ వై.ప్రవీణ్, ఏఎన్ఎం మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

55 మంది నుంచి రక్తం సేకరణ


దాత నుంచి రక్తాన్ని సేకరిస్తున్న నిర్వాహకులు

కొత్తపల్లి: స్థానికంగా ఉన్న సురక్ష ప్యాలెస్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో, కాకినాడ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని తహసీల్దారు చిన్నారావు, ఎంపీడీవో రవికుమార్‌తో కలిసి డాక్టర్ జ్యోతులు శ్రీనివాస్, జనసేన నాయకులు ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 55 మంది రక్తదానం చేసినట్లు రెడ్‌క్రాస్ వైద్యాధికారి దుర్గారాజు తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో జనసేన పార్టీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాస్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి నివాళులు

పిఠాపురం: దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక ఇందిరానగర్ వద్ద గల రాజీవ్ గాంధీ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గంటా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

సామర్లకోట: స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపోలో సత్తెమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. శిథిలమైన ఈ ఆలయాన్ని డిపో మేనేజరు కె.రామకృష్ణ దంపతుల కర్తృత్వంలో పునర్నిర్మించనున్నారు. కార్యక్రమంలో కొడా చైర్మన్ తుమ్మల బాబు, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు తదితరులు పాల్గొనగా, వేమూరి చంటి, సన్నిధిరాజు అంజిబాబు పూజాదికాలు నిర్వహించారు.

మనో వ్యవస్థ అవగాహనతో సంపూర్ణ సంతోషం

బోట్‌క్లబ్: వ్యక్తికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు మనసు వ్యవస్థ అవగాహనతో చేకూరతాయని ప్రముఖ పండితులు మనో సాహితీ వేత్త సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి అన్నారు. స్థానిక సేవాభారతి కార్యాలయంలోని వాధూలసంలో బుధవారం వ్యక్తిత్వ వికాస సమాజం, గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ సైకాలజిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విశిష్ట మనో విజ్ఞాన శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ నుంచి 30 తేదీ వరకూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటలు వరకూ ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రముఖ సైకాలజిస్టులు వి.జనార్దనం, ఎన్.మహాలక్ష్మీకుమార్, వి.మనోహర్, ఉదయభాస్కర్, పి.సుబ్బరాజు, హైమ, కేశవాచార్యులు, కె.సుబ్బారావు, అక్కంశెట్టి రాంబాబు, బి.లక్ష్మీనారాయణ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.


తడిసిన ధాన్యంలో మొలకలను చూపుతున్న రైతు రమేష్

ధైన్యపు రాశులు

- రైతుల గోడు పట్టని ప్రభుత్వం
- కురుస్తున్న వర్షాలకు ధాన్యానికి మొలకలు
- అక్కరకు రాని కొనుగోలు కేంద్రాలు
- లక్ష్యం పేరుతో అధికారుల నిర్లక్ష్యం

సామర్లకోట: తమ గోడు పట్టించుకునేవారు లేరని రైతులు వాపోతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో ఉన్న ధాన్యం రాశులు తడిసి ముద్దవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాల్లో మడుల్లోకి నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పొలాల్లోకి ట్రాక్టర్లు వెళ్లే మార్గం లేక ఎత్తైన ప్రదేశాలకు ధాన్యాన్ని తీసుకురావాలంటే రూ.నాలుగు వేలు ఖర్చవుతోందని రైతులు వాపోతున్నారు. పొలాల్లో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తే ఈ సమస్యలు ఉండేవి కాదని రైతులు చెప్తున్నారు. ఒక రోజు కొనుగోలు చేసి విరామం ఇచ్చి మళ్లీ మిల్లులకు సేకరణ లక్ష్యం పూర్తయ్యిందని చెప్పడం వల్ల ధాన్యం పొలాల్లోనే ఉంచేయాల్సి వస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో వర్షం తెరిపిచ్చిన తరువాత ధాన్యాన్ని ఆరబోస్తున్నామని, ఇంతలోనే మళ్లీ ఎక్కడ వర్షం వస్తుందోనని భయమేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మూడు నెలల క్రితం ధాన్యం కోతలు ప్రారంభం అయ్యాయని, వ్యవసాయాధికారులు, సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు గడ్డు పరిస్థితి ఏర్పడిందని వెంకటకృష్ణరాయపురం రైతు ఇంటి రమేష్ చెప్తున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం మొలకలు వస్తున్నాయని, గతంలో మనుషులతో వరి కోతలు జరిగే సమయంలో వరి కుప్పలు వేసుకుని రైతులకు అవకాశం ఉన్నపుడు కుప్పలు నూర్చేవారమని పేర్కొన్నారు. ఆ కోతలు పూర్తి కాగానే అపరాలు వేయడం వల్ల రైతుకు అదనపు ఆదాయం వచ్చేదని, అయితే నేడు వరి యంత్రాలతో కోతలు చేయడం వల్ల అపరాలకు అవకాశం లేకుండా పోయిందని ఆయన చెప్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



మండలంలో వీకే రాయపురం, అచ్చంపేట, గొంచాల, చంద్రంపాలెం గ్రామాల్లో వరి నాట్లు ఆలస్యంగా జరిగాయి. దాంతో కోతలు ఆలస్యమై రైతులు తుపానుకు చిక్కుకున్నారన్నారు. ఈ మేరకు 2,500 ఎకరాలలో సుమారు 8,500 మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పొలాల్లో ఉంది. వీటిలో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో మొలకలు వచ్చినట్లు గుర్తించాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. జాయింట్ కలెక్టరు ఇచ్చే సూచనల మేరకు మొలకలు వచ్చిన, తడిచిన ధాన్యం కొనుగోళ్లు ఉంటాయి.

– ఐ.సత్య, ఏఓ, సామర్లకోట

నిజం.. డిప్యూటీ సీఎం తాలూకే!

- ప్రత్యక్ష నరకంలో పిఠాపురం ప్రజలు!
- మురుగు కూపాలను తలపిస్తున్న వీధులు
- ఫిర్యాదులకు స్పందించని అధికారులు


పిఠాపురంలో ఏవీధిలో చూసినా ఇదే పరిస్థితి

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇలాకా అంటూ గొప్పలు చెప్పుకుంటున్న పిఠాపురం వీధుల్లో వర్షపు నీటిలో జనం ప్రత్యక్ష నరకం చవి చూస్తున్నా మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడడం లేదని పట్టణ వాసులు వాపోతున్నారు. పట్టణంలో ఏవీధి చూసినా మురుగుకూపంగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఎక్కడ పడితే అక్కడ వర్షపు నీటితో వీధులు చెరువులుగా మారిపోయాయి. డ్రైన్లు పొంగి పొర్లుతుండడంతో వీధులన్నీ మురుగునీటితో అడుగు వేసేందుకు వీలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పట్టణ వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం పట్టణంలో కొండప్ప వీధిలో ఇళ్ల ముందు చేరిన మురుగునీరు ఆ ప్రాంత వాసులకు నరకం చూపిస్తున్నాయి. వర్షం ప్రభావంతో నీరు పోయే మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తాము మున్సిపల్ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరు పట్టించుకోడం లేదని అక్కడివారు వాపోతున్నారు. గతంలో ఇదే సమస్యపై ఆ ప్రాంత వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ముమ్మిడి రత్న సుజిత మున్సిపల్ అధికారులకు, పాడా పీడీ నిర్వహిస్తున్న గ్రీవెన్సులో రెండు సార్లు ఫిర్యాదు చేశారు. పాడా పీడీ చైత్ర వర్షిణి, మున్సిపల్ కమిషనర్ కనకారావు స్వయంగా పరిశీలించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతంలో కాలువల గుండా వచ్చిన మురుగునీరు ఇళ్ల ముందు నిలిచిపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగయ్యమ్మరావుపేట తదితర ప్రాంతాల్లో ఐతే ఇక చెప్పనక్కర లేదు. అవి వీధులు అంటే నమ్మలేనంత విధంగా మురికి కాలువలుగా కనిపిస్తున్నాయి. ప్రతి సోమవారం పాడా కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో సగానికి పైగా ఈ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నా రెండు నెలలుగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

రచనా వ్యాసంగాన్ని అలవరచుకోవాలి

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే రచనా వ్యాసంగాన్ని అలవరచుకోవాలని సాహితీ స్రవంతి నాయకులు చిరిగిన మంజుల అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పీసీసీ అధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం కథా రచనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ విద్యార్థులందరూ తమ అమ్మమ్మ తాతయ్య, నానమ్మల నుంచి అనేక నీతి కథలు తెలుసుకుంటారని, ప్రతి కథలో సారాంశం విద్యార్థులు సమాజంలో ఎలా నడుచుకోవాలో తెలియజేస్తాయని, ప్రతి ఒక్కరూ కథలపై ఆసక్తి పెంచుకుని కథలు రాయడంలో మెళకువలు తెలుసుకోవాలన్నారు. ఉదయం తెప్పల యోగేష్, లోకేష్ విద్యార్థులకు కరాటే శిక్షణ ఇవ్వగా బుద్దా శ్రీనివాస్ సైన్స్ ప్రయోగాలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, అమృత, నమ్రత, రవికుమార్, సాయి, బంగారు, హర్ష, సందీప్, లావణ్య, అంజలి, కృష్ణ పాల్గొన్నారు.


వేసవి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాగరాజు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంజుల

గ్రంథాలయాలతో జ్ఞాన సమృద్ధి

పెద్దాపురం: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విద్యార్థికి మరింత జ్ఞానం పెరుగుతుందని, శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం పుస్తక పఠనం, కథలు చదవడం నేర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ తరగతులు దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు మురళి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుకు భూమిక

- పంటలకు జీవం.. రైతులకు లాభం..
- పీఎండీఎస్ విధానంతో బహుళ ప్రయోజనాలు
- పొదుపు సంఘాల ద్వారా కిట్ల విక్రయం
- నేలను సారవంతం చేసేందుకు ఉపయుక్తం


పీఎండిఎస్ కిట్లను తయారు చేస్తున్న పొదుపు సంఘాల సభ్యులు

పెద్దాపురం: ఇటీవల కాలంలో ప్రకృతి వ్యవసాయానికి డిమాండ్ పెరుగుతోంది. గత ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించింది. ఫలితంగా నియోజకవర్గంలో సుమారు 300 మంది రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారు. మరో 570 మంది రైతులు రెండు రకాలుగానూ పంటలు వేస్తున్నారు. నిన్న.. మొన్నటి వరకు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పెసర మాత్రమే వేసి నేలను సారవంతం చేస్తూ వచ్చారు.

పీడీఎంఎస్ కిట్

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పీఎండీఎస్ (ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్) కిట్లను అందజేసేలా ప్రకృతి వ్యవసాయ విభాగం కృషి చేస్తోంది. ఎకరం వరి చేలో 32 రకాల విత్తనాలు గల 14 కేజీల పీఎండీఎస్ కిట్లను అందిస్తోంది. ఈ కిట్ల తయారీ, విక్రయం రెండూ పొదుపు సంఘాల ద్వారా చేయిస్తోంది. ఒక్కో కిట్ రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తోంది.

కిట్లలో 30 రకాల విత్తనాలు


ఈ కిట్లలో మినుములు, పెసర, బొబ్బర్లు, చిక్కుడు, నువ్వులు, ఆముదం, వేరుశనగ, ధనియాలు, మెంతులు, ఆవాలు, రాగులు, మొక్కజొన్న, కొర్రలు, సామలు, జీలుగ, కట్టిజనుమ, పిల్లి పెసర, ఆకుకూరలు, దుంప, తీగజాతి వంటి విత్తనాలను శుద్ధి చేసి పిల్లి పెసర రెండు కేజీలు, జీలుగ రెండు కేజీలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. మిగిలిన 30 రకాల విత్తనాలను తీసుకుంటున్నారు.

వేర్లు ప్రధానం

వీటిని పంట పొలాల్లో చల్లిన తరువాత మొలకలు రాగానే వాటిని నేలలో దుక్కి దున్నడం ద్వారా నేల సారవంతమవుతుంది. వీటి వేర్ల వల్ల నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయి. నీటి సామర్థ్యం పెరుగుతుంది. నేల కోతకు గురికాకుండా ఉంటుంది. సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. కలుపు మొక్కల బెడద ఉండదు. స్థూల సూక్ష్మ పోషకాలు ప్రధానంగా పంటకు అందుతాయి.


కిట్లలో అందజేసే ఆయా రకాల విత్తనాలు

ఖర్చుల భారం తగ్గుతుంది



ప్రకృతి వ్యవసాయం చేయడమే కాకుండా ప్రస్తుతం ఫార్మర్ మాస్టర్ ట్రైనీగా విధులు నిర్వర్తిస్తున్నా. పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు నడిచేలా ప్రోత్సహిస్తున్నా. ఈ విధానం వల్ల ప్రారంభంలో దిగుబడి తక్కువగానే ఉంటుంది. రానురాను ఆ దిగుబడి బాగా పెరుగుతుంది.

– ఎ.ఎలియాజర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, కాకినాడ

సెగ్మెంట్‌లో ఐదు గ్రామాల్లో



నియోజకవర్గంలో జి.రాగంపేట, గోరింట, అచ్చంపేట, ఉండూరు, పనసపాడు గ్రామాల్లో ప్రకృతి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 300 మంది రైతులు ఈ వ్యవసాయాన్ని చేస్తున్నారు. పీఎండీఎస్ కిట్లను తయారు చేయడానికి పొదుపు సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. రైతు సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా పీఎండీఎస్ కిట్లను అందజేస్తున్నాం.

– జి.శివచక్రం, ఎన్‌పీఎం మాస్టర్ ట్రైనీ, పెద్దాపురం

కొత్తపల్లిలో కుండపోత వర్షం


సముద్రంలో ఎగసిపడుతున్న అలలు


భారీగా కురుస్తున్న వర్షం

కొత్తపల్లి: తుపాను ప్రభావంతో బుధవారం ఎడతెరిపి లేకుండా కుండాపోత వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరగడంతో పాటు, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. చేతికి అంది వచ్చిన మామిడికాయలు గాలికి రాలిపోవడంతో రైతులకు నష్టం చేకూరింది. ప్రస్తుతం వేట నిషేధం అమలులో ఉన్న నేపథ్యంలో నాటు పడవలపై మాత్రమే మత్స్యకారులు వేటకు వెళుతున్నారు. సముద్రంలో ప్రతికూల పరిస్థితుల్లో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నేడు హనుమజ్జయంతి


సామర్లకోటలోని ప్రసన్నాంజనేయస్వామి

సామర్లకోట: హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం ఆలయాలలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయంలో ఉదయం నుంచి సామూహిక అభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాస్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు, సాయంత్రం 65 అడుగుల ఎత్తయిన ఆంజనేయస్వామికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే మాండవ్య నారాయణస్వామి ఆలయంలో కొలువై ఉన్న ఆంజనేయ ఆలయంలో ఈఓ బిక్కిన వెంకట్రాయచౌదరి సూచనల మేరకు గురువారం ఉదయం స్వామికి అభిషేకాలు, తమలపాకుల పూజలు, పారాయణలు జరుగుతాయని అర్చకులు అనంత పద్మానాభాచార్యులు తెలిపారు. కాగా స్టేషన్ సెంటర్‌లోని వీరాంజనేయ ఆలయంలోను, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న భక్తాంజనేయ ఆలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు విశ్వహిందూ పరిషత్ నాయకులు తెలిపారు. శోభాయాత్రను శృంగవృక్షానికి చెందిన దత్త పీఠాధిపతి సాయిదత్త నాగా నంద సరస్వతి స్వామిజీ ప్రారంభిస్తారన్నారు. ప్రతి హిందూ కుటుంబం నుంచి ర్యాలీలో పాల్గొన్నాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు కార్మికుల సమ్మె

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికుల సమ్మె బుధవారం కూడా కొనసాగింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 7వ తేదీ నుంచి నల్లబాడ్జీలు ధరించి నిరసనతో సమ్మెలోకి దిగారు. అయినా మున్సిపల్ అధికారులు, పాలకుల నుంచి ఎటువంటి స్పందన లేక పోవడంతో మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షలు ప్రారంభించిన విషయం తెలిసిందే. యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 15 ఏళ్ల సీనియారిటీ ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధులలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.ఐదు లక్షలు నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఏడాదిలో 55 ఆదివారాలు, కేంద్ర, రాష్ట్ర పండగలకు 17 రోజులు సెలవులు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సీనియార్టీ ప్రాతిపదికలో వేతనాలు చెల్లించాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలనే డిమాండ్‌లు ప్రభుత్వం వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించక పోతే జులై 9వ తేదీ నుంచి పారిశుధ్య కార్మికులు కూడా సార్వత్రిక సమ్మెలోనికి దిగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పులపకూర రామకృష్ణ, లంక శ్రీహరి, నక్క రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ర్యాలీ



పిఠాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పిఠాపురం: పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంలో పలు రాజకీయ పార్టీలు బుధవారం ర్యాలీలు చేపట్టాయి. సైనికులకు, ప్రధాని నరేంద్రమోదీకి సంఘీభావంగా పాదగయ క్షేత్రం నుంచి కోట గుమ్మం సెంటర్ మీదుగా ఉప్పాడ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులను సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, పిఠాపురం నియోజవర్గ జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, బిజెపి కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

కాకినాడ రూరల్: వయో వృద్ధుల సంక్షేమానికి తెలంగాణ మాదిరిగా రాష్ట్రంలో డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులు ఎవరి వ్యాపకాల్లో వారు బిజీగా ఉండడంతో వృద్ధులను పలకరించే నాథుడే కరవయ్యారన్నారు. దీంతో ఇంట్లో ఒంటరిగా కాలాన్ని వెళ్లదీస్తున్న వృద్ధులకు మానసిక సమస్యలకు గురవుతున్నందున డే కేర్ సెంటర్లు ఉపశమనం కలిగిస్తాయన్నారు. ఇక్కడ వైద్య పరీక్షలతో పాటు గ్రంథాలయం, క్యారమ్స్, టెన్నిస్, చెస్ వంటి ఆటలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డే కేర్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, సత్యనారాయణ, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదంతో ప్రపంచ శాంతికి ముప్పు

బోట్‌క్లబ్: ఉగ్రవాదం అనేది ఒక పదం కాదని ఇది మానవాళికి, ప్రపంచ శాంతికి ముప్పని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి చిట్ల కిరణ్ అన్నారు. స్థానిక భానుగుడి సెంటర్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉగ్రవాద ముప్పును ఎదుర్కొంటోందన్నారు. ఉగ్రవాద చర్యల వల్ల అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు భారత్ ఆర్మీ అర్ధరాత్రే సూర్యుడిని చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భాస్కర్, సిరాజ్, నాగేంద్ర, శ్రీవల్లీ, భాను పాల్గొన్నారు.